ఓంశ్రీసాయిరాం.

మూడు దినాలనుంచీ ఇక్కడ ఉపన్యసించిన పండితులు రామాయణం గురించి ప్రసంగించారు. రామాయణం ప్రత్యేకంగా అధ్యయనంచేసిన దీక్షితులు ప్రసంగించటం మనం అర్థంచేసుకోవచ్చు. ఇతర అంశాలను గురించి ప్రసంగించే విద్వాంసుడుకూడా తన మామూలు విషయాలను వదలి రామాయణం గురించి ప్రసంగించాడు. నిజానికి రామాయణం ఒక మహాసముద్రం. ఎన్ని కాలువలైనా త్రవ్వి వాటిద్వారా జలం ప్రవహింపచేయవచ్చు. కనీసం ఈనాడైనా ఎవరైనా కృష్ణతత్త్వం గురించి మాట్లాడుతారేమోనని అనుకున్నాను. రామతత్త్వం విసుగు కలిగిస్తుందని కాదు. భగవంతుని తత్త్వం నిత్యనూతనం. అది ఎప్పుడూ సువాసనలు వెదజల్లగలదు. ఎప్పుడూ మనోహరమే. ఎందుకంటే జీవితమే నిత్యనూతనం. కనుక, ప్రతి జీవితము తత్త్వగ్రహణకు ఒక నూతనావకాశం. నిన్న గతించిపోయింది. కాబట్టి, ఈనాడే ఆ నూతనావకాశం లభిస్తుంది. అది రేపు చిక్కునోలేదో మీరు చెప్పజాలరు. ప్రతి నిముషమూ అద్వితీయముగా, అమూల్యముగా భావించి మీరు స్వాగతం పలుకవలెను. చేయిజారిపోయిన ముహూర్తాలకోసం విచారించవద్దు. చేతికందిన వర్తమాన కాలాన్ని దక్కించుకోండి. హనుమంతుడు సీతాన్వేషణ చేసినవిధంగా భగవంతునికోసం అన్వేషించండి. ఆయన సీతను కళ్లతో చూడలేదు. ఆమెను గురించిన వర్ణన మాత్రం విన్నాడు. రాముడు ఆమెకోసం అంత గాఢంగా పరితపించటాన్ని బట్టి సీత ఏవిధంగా ఉండగలదో నిర్ణయించుకోగలిగాడు. అది ప్రకృతి పురుషుల గాఢానుబంధం. లంకలో కనిపించిన ప్రలోభాలనూ, ఆకర్షణలనూ, నిరాకరిస్తూ వాటి నడుమ సీతకోసం వెదికిన హనుమంతునిలా మానవుడు దురవగాహమైన ఆదిశక్తిని అన్వేషించాలి.

అది తెలియని వస్తువు కాబట్టి దానికుండే లక్షణాల వల్ల దానిని కనుగొనవలెను. మహర్షుల అనుభూతులే మార్గసూచికలు. అటువంటి దిగ్దర్శనం భాగవత రామాయణ పురాణాదులలో లభించును. లోకమాతను, త్రిపురసుందరిని మీ హృదయాలలో ప్రతిష్ఠించుకొనుడు. ఆమె స్వచ్ఛమైన రూపురేఖలను స్పష్టముగా గ్రహించండి. అప్పుడు మీరు ధైర్యముగా రాక్షసలోకమున ప్రవేశించండి. విజయం పొందగలరు. అన్వేషణలో మీరు నిమగ్నులు కావాలి. స్థిరవిశ్వాసం మీలో నెలకొల్పుకోవాలి. అప్పుడు మీలో ఆనందం నిండిపోగలదు. మీరు అన్వేషించ దలచిన సీత ఆనవాలు ఎవరు చెప్పగలరు? ప్రభువైన రాముడే చెప్పగలడు. ఆయననే మార్గదర్శకునిగా గ్రహించండి. వేదాల ప్రమాణం అధికారికమైనది. లక్ష్మణుడు, సుగ్రీవుడు శాస్త్రములవంటివారు. ఇతరులు చెప్పేదానిని అనుసరించేవారు. వారికి అధికారం లేదు. సీతను చూడలేదు కనుక వారు సీతను వర్ణించలేదు, వర్ణించలేరు.

రాముడు చిత్రకూటములోని ఋష్యాశ్రమములకు వెళ్ళినప్పుడు అక్కడ వున్న ఋషులూ, సాధువులూ, వేదపండితులూ అయిననూ ఆయనను పరివేష్టించినారు. ఆయన సందర్శనము లభించినందులకు వారు కృతజ్ఞతా పూర్వకంగా రంగురంగు పుష్పహారములతో ఆయన కంఠమునలంకరించినారు. గాఢభక్తి ఆ హారములకు సూత్రముగా అలరారినది. రాముడు గోచరుడు, అగోచరుడు అని వారు గ్రహించిరి. ధర్మమును కర్మమును స్థాపించుటకు ఆయన అవతరించినట్లు గుర్తించినారు. ధర్మము ద్వారా, ధర్మబద్ధమైన కర్మల ద్వారా మానవుడు శాంతినీ, ముక్తినీ తప్పక సాధించగలడు. ధర్మసంస్థాపనయే అవతారముల లక్ష్యముగా ప్రకటింపబడినది. అజ్ఞాన బంధములనుంచి విముక్తి కలిగినచో ధర్మపు ప్రయోజనమేమిటి?

టిక్కట్లు కొనుక్కొని ఎగిరే అర్హత పొందినవారికి ఎక్కించుకొనుటకు కొన్ని ప్రదేశములందు విమానం క్రిందికి దిగవచ్చును. అదేవిధముగా ముక్తికి అర్హత సంపాదించిన వారిని రక్షించుటకొరకు పరమాత్ముడు క్రిందికి దిగిరావలెను. తత్ఫలితముగా ఇతురులుకూడా భగవంతుని గురించి, అనుగ్రహము గురించి, దానిని పొందుటకు అనుసరించవలసిన విధానములను గురించి, ముక్తి వల్ల కలుగు ఆనందము గురించి తెలుసుకొనే అవకాశం కలుగుతుంది. ఈనాటికీ విమానయానం అసాధ్యమునుకునేవారు కొందరున్నారు. విమానాన్ని శపించేవారున్నారు. దాన్ని నిరసించేవారున్నారు. అదేవిధంగా రక్షించుటకు వచ్చిన అవతారమును విమర్శించి నిరసించేవారున్నారు.

దీక్షితులు కబంధుని గురించి చెప్పాడు. రాముని నిందించి నిలువునా మ్రింగివేయదలచాడు కబంధుడు. కాని, రాముడు కబంధునికి శాపవిమోచనం కలిగించి పూర్వజ్ఞానం ప్రసాదించాడు. మీరు వేదాలనూ, బ్రాహ్మణులనూ నిందిస్తే నాకు దూరమైపోతారు. అలా చెయ్యకపోతే దగ్గరవారౌతారు. వివాహానంతరం రాముడు అయోధ్యకు తరలివచ్చే సమయాన క్షత్రియుల బద్ధవిరోధియైన పరశురాముడు తారసిల్లాడు. రాముడు రెండు ముక్కలుచేసిన శివధనుస్సునుండి వెలువడిన ధ్వని విని పరశురాముడు భయంకరుడై క్రోధాగ్ని జ్వాలలతో మండిపోతున్నాడు. నా తండ్రి ధనుస్సు విరవవలసిందని సవాలుచేసి, నాతో యుద్ధానికి రమ్మన్నాడు. అప్పుడు రాముడు, 'మీరు నాకు పూజ్యులు. మీరు బ్రాహ్మణులు. విశ్వామిత్రుని బంధువులు' అని బదులు చెప్పాడు.

అవతారపురుషుని జీవితమందలి ప్రతి సన్నివేశము ముందుగా నిర్ణీతమైన ప్రకారంగా నడుస్తుంది. శూర్పణక వచ్చిన తరువాత రావణుడు వస్తాడని రాముడు గుర్తించినాడు. సీత నిజరూపమును అగ్నిలో భద్రపరచి బాహ్యరూపముతో సంచరించవలనదని ఆదేశించినాడు. మానవరూపం ధరించుటకు మునుపే శక్తిస్వరూపిణికూడా తనవెంట రావలెనని రామప్రభువుకు తెలుసును. దేవతలవద్దనుంచి రావణుడు సంపాదించిన వరములు నిరర్థకములు కావలెనంటే అతడేదైనా మహాపాపం చేయాలి.

సీతాదేవికి అగ్నిప్రవేశమనేది కఠిన పరీక్ష కానేకాదు. లంకలో ప్రవేశించుటకు పూర్వమే అగ్నిలో భద్రపరచిన సీతాదేవి నిజస్వరూపం వెలుపలికి తెచ్చుటకు అగ్నిపరీక్షను ఏర్పాటుచేశాడు. అవతారపురుషులు అనుసరించే విధానం అటువంటిది. వారు తమ తత్త్వములు చర్యలలో నిరూపించుతారు. బల్లకట్టుకొని చాటుకోరు. రాముని దివ్యత్వమును జటాయువు గుర్తించాడు. 'రామా! నేను పరమానందం పొందినాను. ఈ దేహము ధన్యమైనదనే సంతృప్తి కలిగినది. నిన్ను దర్శించుకున్నాను. నీ స్పర్శసుఖం పొందాను. నీతో సంభాషించినాను. నీ కంఠస్వరమును మనసారా విన్నాను'. తన జీవితమందలి ప్రతి సంఘటనకూ ఎటువంటి ప్రాముఖ్యమున్నదో రామునికే తెలుసు. తరువాత రాబోయే సన్నివేశమేదో ఆయనకే తెలుసు. తన జీవిత సంఘటనలన్నీ ఆయనే తీర్చిదిద్దుకున్నాడు.

రాముడు కష్టములను సహించే విధానమునూ, కృష్ణుడు కష్టములను అధిగమించు మార్గమునూ బోధించెదరని చెప్పగా మీరు విన్నారు. అది సరికాదు. వెలుపలికి సీతకోసం వియోగదుఃఖం అనుభవిస్తున్నప్పటికీ ఆయన లోపల అంతా ఆనందమే. రామతత్త్వం రామునికే ఎరుక. ఇతరులకేం తెలుస్తుంది. అతి కష్టంతో రాముని అనుగ్రహలేశం సంపాదించుకోగలరు. అదికూడా అంతరంగంలో తీవ్రమైన దైవప్రార్థనతో నిమగ్నులైనప్పుడే సాధ్యంకాగలదు. ఆయనను తలచండి. ఆయనను పిలవండి. ఆయన కరిగిపోతాడు. ఆయన ఏరూపంలో ఉన్నప్పటికీ మీ భక్తి తీవ్రతవల్ల ఆయనను పోల్చుకోగలుగుతారు. ఆయన చెట్టునీడలో నిలబడి పెదవులమీద వేణువుతో గోపబాలుని రూపంలో కనబడవచ్చు. ఆ మూర్తిని దర్శించి, ఆరాధించి హృదయంలో ప్రతిష్ఠించుకోవాలి. భగవంతుడు ప్రేమమయుడనీ, అనుగ్రహపూరితుడనీ, దయాళుడనీ మీరు స్తుతిచేస్తారు. వాటిని సంపాదించటానికి మీరు పరితపిస్తున్నారా? వాటిని పొందగలమనే విశ్వసిస్తున్నారా? వాటిని భద్రపరచుకొనుటకు కృషిచేస్తున్నారా?

ఉదాహరణకు రావణుని చెల్లెలు శూర్పణక విషయం తీసుకోండి. లక్ష్మణుడు ఆమె ముక్కుచెవులూ కోశాడు. రాముడు తిరస్కరించాడు. సీత ఎగతాళిచేసింది. బెదరిపోయి అన్న దగ్గరకు పరుగెత్తి ఏమని చెప్పిందో తెలుసా? రాముని దివ్యసుందరమూర్తినీ, జగన్మోహనాకారమునూ వర్ణించింది. రాముడు ప్రసరించే మధురిమతో నీ హృదయం నింపుకోమని చెప్పింది. సత్యధర్మముల పాదులో నీరుపోసి పెంచటానికి రాముడు అవతరించటంచేత అగ్నిసాక్షిగా ఆయనను పరిణయమాడి అనుసరించింది సీతాదేవి. సీతను బలవంతాన ఎత్తుకొనిపోయి వివాహం చేసుకోలేదు. శాంతిప్రేమలను పెంపుచేయటం కృష్ణావతార లక్ష్యం. ప్రస్తుతకాలంలో సత్యధర్మశాంతిప్రేమలు నాలుగూ అడుగంటిపోయే ప్రమాదం ఏర్పడింది. అరణ్యములలో తలదాచుకొనుచున్న ధర్మమును గ్రామాలకూ, నగరాలకూ ఆహ్వానించాలి. పల్లెలనూ, పట్టణాలనూ నాశనంచేస్తున్న అధర్మమును అరణ్యములోనికి తరిమివేయాలి. అంతవరకూ మీరు విశ్రమించరాదు. ఇది మీ అందరికీ సంబంధించిన ముఖ్య సమస్య అని గ్రహించాలి.

ఇప్పుడు మీరు మోక్షసాధన అనే సమస్యను గుర్తించలేకపోతున్నారు. పూర్వం ఒక రాజుగారి కొలువులో ఒక సోమరి ఉండేవాడు. చాలా బద్ధకస్తుడు. రాజుగారు ఎవరినైనా పిలుచుకు రమ్మని అంటే ముందుగానే ఎన్నో సాకులు చెప్పేవాడు. 'నేను వెళ్ళేసరికి ఆయన ఇంటి వద్ద ఉండడేమో.. నన్ను మర్యాదగా పలకరిస్తాడో లేదో, నన్ను చూచి కోపంతో మండిపోతాడేమో, వెడితే సమయానికి తిరిగి రాలేకపోతానేమో' అంటూ కుంటిసాకులు ఏకరవు పెట్టేవాడు. అందువల్ల రాజుగారు ఒక వెడల్పు గుడ్డపట్టీ మీద 'మూర్ఖుడు' అనే అక్షరాలు కుట్టించి దాన్ని తలచుట్టూ కట్టించాడు. వానిని చూచి అందరూ తెలివి తెచ్చుకోవాలని రాజుగారి ఉద్ధేశ్యం. దివాణంలో అందరికీ ఆ సోమరి హాస్యాస్పదుడయ్యాడు. కొన్ని మాసాలు గడచిన తరువాత రాజుగారికి జబ్బుచేసి మంచాన పడ్డాడు. అవసానదశ వచ్చింది. కొలువులోని వాళ్లందరూ ఒకరితో ఒకరు పోటీవేసుకున్నట్లుగా వచ్చి రాజుగారిని పరామర్శచేసి పోతున్నారు.

మూర్ఖుడుకూడా రాజుగారిని చూడటానికి వెళ్ళాడు. రాజు కంటినీరు పెట్టుకుంటూ, 'నా ప్రయాణ సమయం సమీపించింది. వెళ్ళిపోతున్నాను' అన్నాడు. అయితే కొంచెం ఆగండి. నేను వెళ్ళి 'మీ భద్రగజాన్ని సిద్ధంచేస్తాను' అన్నాడు మూర్ఖుడు. 'అక్కడకు ఏనుగుల మీద వెళ్ళలేను' అన్నాడు. 'అయితే రథంలో వెళ్ళండి' అని సూచించగా, ' అదీ లాభంలేదు' అన్నాడు రాజు. 'పోనీ మీ అశ్వరాజం మీద వెళ్ళండి' అన్నాడు మూర్ఖుడు. 'అదీ లాభంలేదు' అన్నాడు రాజు. అప్పుడు మూర్ఖుడు అమాయకంగా,' మహారాజా! అయితే తమరు వెడుతున్న వింత దేశం పేరేమిటి?' అని అడిగాడు. రాజు 'నాకు తెలియదు' అని బదులు చెప్పాడు. ఈ సమాధానం వినగానే మూర్ఖుడు తన తలచుట్టూ కట్టిన గుడ్డ ఊడదీసి చావుకు సిద్ధంగా ఉన్న రాజు తలకు కట్టాడు.' 'మూర్ఖుడు' అనే బిరుదు నీకు సరిపోతుంది. వెడుతున్నాని తెలుసు, ఎక్కడికి వెడుతున్నావో తెలియదు. ఎట్లా ఉంటుందో తెలియదు. కనుక, నిజమైన మూర్ఖుడివి నీవే' అన్నాడు.

కాబట్టి, ఇప్పుడు మీరు చేస్తున్న పనుల విలువనూ, ఆలోచన విలువలనూ తెలుసుకుంటే మీరు చెరుకోవలసిన ప్రదేశం ఎటువంటిదో గ్రహించగలుగుతారు.